ప్రజాశక్తి

సోమవారం 15 జులై 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఇళ్లకు తాళం.. ఊళ్లకు దూరం..

పిన్నెల్లి గ్రామంలో తాళాలు వేసిన ఇళ్లు

- భయం గుప్పిట్లో వైసిపి నాయకులు
- పల్నాడులో గ్రామాలు విడిచి పలాయనం
- పిన్నెల్లి గ్రామంలో 300 కుటుంబాల వలస
- వైసిపి హయాంలోనూ ఇదే పరిస్థితి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజకీయ కక్షలు, కార్పణ్యాలకు నిలయమైన పల్నాడు జిల్లాలో భయానక వాతావరణం నెలకొంది. 2019 నుంచి 2024 వరకు వైసిపి హయాంలో రాజకీయంగా, వ్యక్తిగతంగా ఇబ్బంది పడ్డ టిడిపి శ్రేణులు ప్రస్తుతం గుంభనంగా ఉన్నారు. ఎన్నికల అనంతరం వైసిపి ఓటమి పాలవ్వడంతో వైసిపి నాయకులు, కార్యకర్తలు గ్రామాలు విడిచి వెళ్లిపోయారు. ప్రధానంగా మాచవరం మండలం పిన్నెల్లిలో వందలాది మంది ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. మాచర్ల నియోజకవర్గంలోని ఆత్మకూరు, గుళ్లపాడు, జంగమేశ్వరపాడు, రెంటాల తదితర గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు అనేక మంది ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి తమ గ్రామాలను విడిచి వెళ్లారు.

అధికార మార్పిడితో ప్రారంభమైన అలజడిని అదుపులో పెట్టడానికి టిడిపి ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు టిడిపి కార్యకర్తలు, నాయకులను సమాధానపరుస్తూ ఘర్షణలు, దాడులకు వెళ్లవద్దని నియంత్రిస్తున్నారు. అయితే వైసిపి హయాంలో నష్టపోయిన వారు మాత్రం అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. 2019 నుంచి 2023 వరకు కూడా వైసిపి హయాంలో టిడిపి వారు కూడా ఇలాగే గ్రామాలను విడిచి వెళ్లిన ఘటనలున్నాయి. దుర్గి మండలం ఆత్మకూరులో

▶ 2లో

తెనాలి ప్రాంతంలో వర్షపు నీటితో నిండిన పొలాలు

మూడ్రోజులైనా వీడని ముసురు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మూడ్రోజులుగా వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం కూడా పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు గుంటూరు జిల్లాలో 7 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా పల్నాడు జిల్లాలో 3.6 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. పల్నాడు ప్రాంతంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అధిక వర్షాల వల్ల కొన్ని మండలాల్లో వర్షాలతో ఆకుకూరల తోటలకు, ఉద్యాన పంటలకు నష్టం జరిగిందని రైతులు తెలిపారు. ముసురు కొనసాగుతున్న నేపథ్యంలో సేద్యానికి రైతులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. వర్షం పూర్తిగా తగ్గిన తరువాత పనులు ప్రారంభించాలని యోచిస్తున్నారు. డెల్టాలకు కొన్ని ప్రాంతాల్లో వెదపద్ధతిలో వరిసాగుకు రైతులు సమాయత్తమయ్యారు. పల్నాడు ప్రాంతంలో పత్తి సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందని పత్తి సాగు చేయనున్నట్టు రైతులు తెలిపారు.

పౌల్ట్రీలో స్వాధీనం చేసుకున్న బియ్యం వద్ద విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కోళ్లకు మేతగా రేషన్ బియ్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి పౌల్ట్రీఫీడ్‌గా వినియోగిస్తున్నారనే సమాచారంతో ప్రత్తిపాడు మండలం నడింపాలెంలోని బాలాజీ పౌల్ట్రీ ఫారంలో విజిలెన్స్ అధికారులు ఆదివారం తనిఖీలు చేశారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసే గోతాలతో కూడిన 46 క్వింటాళ్ల బియ్యం నిల్వలను, 5 తెల్ల సంచుల్లో 1.50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పౌల్ట్రీ ఫారం లీజుదారైన నాగవరపు సురేష్.. పౌల్ట్రీ ఫీడ్ ఖర్చు తగ్గించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, పౌల్ట్రీ ఫీడ్‌గా వినియోగిస్తున్నట్లు విచారణలో తెలిపాడు. దీంతో ఆయనపై క్రిమినల్ కేసు నమోదుకు స్థానిక రెవిన్యూ అధికారిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదేశించారు. సిఐ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ బియ్యం నేరుగా వాహనదారులు, డీలర్ల వద్ద ఫౌల్ట్రీ నిర్వాహకులు కొనుగోలు చేయడం వల్ల ప్రభుత్వం ముద్రించిన గోతాల్లోనే నిల్వ ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు.

8లో

డయేరియా ప్రబలిన ప్రాంతంలో బోరు నీటిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

డయేరియా బాధితులకు న్యాయం చేయండి : సిపిఎం

ఆస్పత్రిలో రోగులకు పరామర్శ
ప్రభావిత ప్రాంతాల్లో పరిశీలన

చంద్రన్న బీమాలో నమోదు చేసుకోండి

- కనీస వేతనాల అమలుకు చర్యలు
- ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదు కొనసాగింపు
- ప్రజాశక్తితో కార్మికశాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్‌కుమార్

2లో

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలు

- విద్యా, వైద్యం, నీరు, ఉపాధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులపై వేధింపులు ఆపకుంటే ఉద్యమం
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం పోరాడుతుందని ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. జిలా సమగ్రాభివృద్ధి ప్రణాళికలనూ రూపొందిస్తున్నట్లు చెప్పారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం నరసరావుపేట నియోజకవర్గ విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ఎస్.వెంకటేశ్వరరాజు అధ్యక్షత వహించగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అక్షరాశ్యతను పెంచడంతోపాటు వరికపూడిశెల ప్రాజెక్టు పనులు మొదలు పెట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నీటి వనరులుంటే భౌతిక పరిస్థితులు బాగుంటాయని, పల్నాడులో ఫ్యాక్షన్ కాకుండా పంటల సాగు, ఉపాధి అవకాశాలు పెంపుదల, విద్య, వైద్యం రంగాల్లో పురోగతిని ప్రభుత్వాలు సాధించాలని కోరారు. ఈ సమస్యల ప్రాతిపదికన సిపిఎం పోరాటాలు చేస్తూనే ఉంటుందని చెప్పారు. ఇందులో భాగంగా ఈనెల 17, 18 తేదీల్లో నరసరావుపేట నియోజకవర్గంలో జరిగే కౌలురైతు సంఘం ప్రచార జాతాను, 19న ఆర్డీఓ కార్యాలయం ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భూ యజమాని సంతకం ఆధారంగా

▶ 2లో

వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని సుందరయ్యనగర్, మానససరోవరంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సైడ్ ఎఫెక్ట్స్ లేని ఫ్రీక్వెన్సీ థెరపీ ద్వారా శారీరక, మానసిక రోగాలకు వైద్య సేవలు అందించారు. ప్రముఖ జర్మనీ శాస్త్రవేత్త మార్కస్ 12 ఏళ్లపాటు పరిశోధనలు చేసి హీలి అనే చిన్న డివైజ్ ద్వారా ఈ వైద్యసేవలు అందించారు. మరో డాక్టర్ రావి నారాయణ ఫ్రీక్వెన్సీ థెరఫిస్టు టైమ్ యువర్ స్పెషలిస్టు గురించి వివరించినట్లు మానససరోవరం నిర్వాహకులు రామిరెడ్డి తెలిపారు.

సిరి ధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి-గుంటూరు

రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షక్ సేవాకేంద్రం నిర్వహణలో ' సిరిధాన్యాలతో జీవన సిరి' అనే అంశంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ విదేశీ మోజులో పడి మన సిరిధాన్యాలను అశ్రద్ధ చేయటమే నేటి అనారోగ్యాలకు మూలం అని అన్నారు. 150 ఏళ్ల క్రితం మధుమేహం అంటే ఎవరికీ తెలియదని, కానీ నేడు 20-25శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని అన్నారు. పుట్టే ప్రతి వంద మంది పిల్లల్లో 10 నుండి 15 మంది బుద్ధిమాంధ్యంతో పుడుతున్నారని వివరించారు. మన పూర్వీకుల ఆహార అలవాట్లు అయిన చిరుధాన్యాలను పక్కకునెట్టి బియ్యం, గోధుమలు వంటి ఆహారధాన్యాలను ఉపయోగించేలా మన జీవనశైలి మారిందన్నారు. విపరీతంగా ప్లాస్టిక్ వాడకం, ప్రొసెసింగ్‌ఫుడ్, జంక్‌ఫుడ్ మొదలైన విదేశీ ఆహార అలవాట్లు, కత్రిమమైన సౌందర్య సాధనాలను విపరీతంగా ఉపయోగించడం అనారోగ్య సమస్యలకు కారణం అన్నారు. ఈ సమస్యకు సిరిధాన్యాలు, కషాయాలే పరిష్కారమని, సంపూర్ణ ఆరోగ్యం కోసం కొర్రలు, అండుకొర్రలు, ఆరికలు, సామలు, ఊదలతోపాటు కషాయాలను ఆహారంగా తీసుకుంటే ఆరు నెలల్లో ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడుతుందని డాక్టర్ ఖాదర్‌వలి వివరించారు. పాలు, టీ, కాఫీ, ప్లాస్టిక్ కవర్లలో, శుద్ధిచేసిన ఆహారాలను మానేయాలని సూచించారు. మధుమేహం, బీపీ, థైరాయిడ్ వంటి రోగాలను నయం చేసే శక్తి 5 సిరిధాన్యాలకు, కషాయాలకు ఉందని డాక్టర్ ఖాదర్ వలి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సరళ ఖాదర్, రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పండ్ల తోటల అభివృద్ధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు సబ్ డివిజన్ పరిధిలోని పండ్లతోటలు సాగు చేసే రైతులు పండ్లతోటల అభివృద్ధి పథకాన్ని వినియోగించుకోవాలని పొన్నూరు హార్టికల్చర్ ఆఫీసర్ పీటా ఉష సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు విడుదల చేస్తుందని చెప్పారు. నిమ్మ తోటలు సాగు చేసే రైతులకు హెక్టారు (రెండున్నర ఎకరాలు)కు సుమారు రూ.16 వేలను మూడేళ్లలో, నాలుగు హెక్టార్ల వరకు రాయితీ అందిస్తాయన్నారు. మినీ ట్రాక్టర్ 20 హెచ్పి సామర్థ్యం గల వాటిని చిన్న, సన్నకారు రైతులు, మహిళలు ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష, ఇతరులకు రూ.75 వేల రాయితీ ఉంటుందన్నారు. పంట కుంటలకు రూ.75 వేల చొప్పున రాయితీ అందజేస్తున్నట్లు తెలిపారు. శాశ్వత పందిళ్లకు ఎకరాకు రూ.లక్ష రాయితీ అందిస్తామన్నారు. తీగజాతి కూరగాయల హైబ్రిడ్ విత్తన పథకం కింద హెక్టారుకు రూ.20 వేల రాయితీ అందజేస్తామన్నారు. విడిపూలు సాగు చేసే తోటల రైతులకు హెక్టారుకు 16,000 రూపాయలు సబ్సిడీగా అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని చేబ్రోలు, పొన్నూరు పరిసర మండల ప్రాంతాలలోని కూరగాయలు, పండ్లతోటలు సాగు చేసే రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆసక్తి ఉన్న రైతులు 7995086904 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ పథకాలకు దరఖాస్తులు చేసుకున్న రైతులు వారి ఆధార్, పట్టాదారు పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్, జిరాక్స్ పత్రాలతో పాటు పాస్పోర్ట్ సైజు ఫొటోలు అందజేయాలని సూచించారు.

జిజిహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవ వేడుకలను ఆపరేషన్ దియేటర్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సర్జరీ విభాగం హెచ్ఓడి డాక్టర్ సుమిత శంకర్ తో కల్సి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ కేక్ ను కట్ చేశారు. ప్లాస్టిక్ సర్జరీ వల్ల జరిగే ప్రయోజనాలు, పురోగతి గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో ఉచిత శస్త్రచికిత్స శిబిరాన్ని నిర్వహించిన్నట్లు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ విభాగం ఉన్నంత శిఖరాలకు తీసుకుని వెళ్లడం లో డాక్టర్ సుమితా శంకర్ గణనీయమైన కషి చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ విభాగం ఫాసియోమాక్సిల్లరీ ట్రామా, హ్యాండ్, ఫింగర్ రీప్లాంటేషన్, ఫ్యాట్ గ్రాఫ్టింగ్, ఆంకోప్లాస్టీ ఆర్థోప్లాస్టీ రీకన్‌స్ట్రక్టివ్ ప్రొసీజర్‌ల వంటి కాస్మెటిక్ సర్జరీలను నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులతో డిపార్ట్‌మెంట్ సేవలను విస్తరిస్తున్నారని ఆయన చెప్పారు. కాలిన గాయాలు, ప్లాస్టిక్ సర్జరీ కోసం ప్రత్యేకమైన యూనిట్లను, బ్రెస్ట్ క్లినిక్, డయాబెటిక్ ఫుట్, పాడియాట్రీ కేసుల ను చేస్తున్నారని ఆయన అన్నారు. డాక్టర్ సుమితా శంకర్ అభ్యర్థన మేరకు సెలవు రోజు ఆదివారం అయినప్పటికీ అదనపు గంటలు పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య సేవా ట్రస్ట్ ద్వారా ఎనిమిది మంది రోగులకు శస్త్రచికిత్స చేసినట్లు ఆయన చెప్పారు. చీలిక పెదవి, సిండక్టిలీ, పోస్ట్-బర్న్ కాంట్రాక్చర్ కేసులతో పాటు, నరాల దెబ్బతినడం, ముఖ ఎముక పగుళ్లకు శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. డాక్టర్ సుమితా శంకర్ మాట్లాడుతూ ఈ విభాగం ముగ్గురు ఫ్యాకల్టీ నుంచి పది మందికి పైగా వచ్చారని తెలిపారు. అధునాతన కేసులకు పరిధిని విస్తరించారని ఈ విభాగం రాష్ట్రం మొత్తానికి రెఫరల్ సెంటర్‌గా పనిచేస్తుందని వివరించారు.

ఆహారంలో మార్పులతో వ్యాధులు

ప్రజాశక్తి-గుంటూరు

చిన్న, పెద్దలలో పెరిగిపోతున్న లివర్, జీర్ణకోశ వ్యాధులకు ఆహార, వ్యవహారాలలో మార్పులు , వాతావరణ కాలుష్యం కారణమనిరమేష్ హాస్పటల్‌కు చెందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ఎంఎంవి వీరేంద్ర యశస్వి అన్నారు. గ్యాస్ ట్రబుల్ అని భావించి ఏదో ఒక ఔషధం తీసుకొనడం వల్ల చిన్న సమస్యలు పెద్దవిగా తయారై ప్రాణాంతక వ్యాధులుగా మారుతున్నాయన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ యశస్వి మాట్లాడుతూ నేడు ప్రజలను పట్టిపీడిస్తున్న వివిధ అనారోగ్య సమస్యలకు ముఖ్యంగా వారు తీసుకునే ఆహారం కారణం అని అన్నారు. ఆహారంలో నాణ్యత లోపం వల్ల, రకరకాల కెమికల్స్, రుచికరంగా ఉండటానికి కావాల్సిన వివిధ రకాల పదార్థాలు కలిపిన ఆహారం తీసుకోవటం వల్ల క్యాన్సర్, గ్యాస్ ట్రబుల్, విరోచనాలు, షుగర్, బిపి మొదలైన సమస్యలు తలెత్తుతాయన్నారు. ఆహారంలో మైదా వాడకం తగ్గించాలని, నూనెలు నాణ్యత కలిగినవి ఉపయోగించాలని, సాధారణంగా ఒకసారి కాగిన నూనెను రెండవసారి వినియోగించటం ఆరోగ్యానికి అంత మంచిది కాదని తెలిపారు. మార్కెట్లో విరివిగా దొరికే వివిధ రకాల నూనెలు కాకుండా గానుగ పట్టించిన నూనెను, కొబ్బరి నూనె, నువ్వుల నూనె, ఆలివ్ ఆయిల్ లాంటి నూనెలు వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గ్యాస్ ట్రబుల్‌కు మితిమీరి మందులను వాడటం వల్ల, పొట్టలో మనం తీసుకున్న ఆహారాన్ని జీర్ణం చేయుటకు ఉత్పత్తి అయ్యే జీర్ణరసాలు ప్రభావం తగ్గి మలబద్ధకానికి దారితీస్తుందన్నారు. నేడు లివర్ సమస్యలకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, లివర్ మార్పిడి కూడా జరుగుతుందని, అలా లివర్ మార్పిడి చేయించుకున్న వ్యక్తులలో మంచి ఫలితాలు కనపడుతున్నాయని. లివర్ మార్పిడికి సంబంధించి రెండు విధానాలు అమలులో ఉన్నాయన్నారు. వాటిలో ఒకటి మరణానంతరం వారి అవయవాలు దానం చేసే వారి నుంచి తీసి, అవసరమైన వారికి అమర్చటం, రెండవది రక్తసంబంధీకులు వారిలోని లివర్‌లో కొంత భాగం ప్రభుత్వ ఆంక్షలను అనుసరించి తీసి అవసరమైన వ్యక్తిలో అమర్చడం అని వివరించారు. మన శరీరంలో తీసిన లివర్ మళ్లీ పునరుత్పత్తి అయ్యే శక్తి ఉందని తెలిపారు. అవగాహన సభ్యులు డాక్టర్ వీరేంద్ర యశస్విని అవగాహన సభ్యులు సత్కరించారు. కార్యక్రమానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, విశ్రాంత పోలీస్ అధికారి హుస్సేన్, ఆరోగ్య విషయాల విశ్లేషకులు వివి రావు, అవగాహన సీనియర్ సభ్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇళ్లకు తాళం.. ఊళ్లకు దూరం..

(మొదటి పేజీ తరువాయి)

వందలాదిమంది గ్రామం విడిచి వెళ్లిన పరిస్థితులపై తీవ్రంగా స్పందించిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చలో ఆత్మకూరుకు పిలుపునిచ్చారు. టిడిపి కార్యకర్తల పరామర్శకు వెళ్తానని చంద్రబాబు చెప్పినా ఇందుకు అప్పటి వైసిపి ప్రభుత్వం అనుమతివ్వలేదు. 2000 జనవరిలో ఆత్మకూరుకు అనుమతి ఇవ్వకపోవడంతో మూడురోజులపాటు గుంటూరులోనే బస చేసి చంద్రబాబు తిరిగి తన నివాసానికి వెళ్లిపోయారు. ఈ ఘటన అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ప్రస్తుతం గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో పలువురు వైసిపి నాయకులు ఇప్పుడు గ్రామాలు విడిచి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది.

2024 ఎన్నికల్లో వైసిపి ఓడిపోయి కూటమి ప్రభుత్వం ఏర్పడింది. వైసిపి అభ్యర్థులు ఏడు నియోజకవర్గాల్లో ఓడిపోయారు. అధికార మార్పిడితో తిరిగి పల్నాడులో ఆధిపత్య పోరు మొదలైంది. గురజాల నియోజకవర్గం మాచవరం మండలం పిన్నెల్లిలో దాదాపు 300 కుటుంబాలు గ్రామం విడిచి వెళ్లారు. గత నెల రోజుల్లో కవ్వింపు చర్యలు, ఘర్షణలు ఏమీ లేకపోవడంతో దాదాపు 100 కుటుంబాల గ్రామానికి తిరిగి వచ్చారు. కానీ ఇంకా 200 కుటుంబాల వారు రాలేదు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు కూడా పిన్నెల్లి గ్రామం నుండి టిడిపికి చెందిన 15 కుటుంబాలు గ్రామాన్ని విడిచిపెట్టి వెళ్లాయి. ఇలాగే పలు గ్రామాల్లో ఏపార్టీ గెలిస్తే ప్రత్యర్థి పార్టీ గ్రామాలను విడిచి వెళ్లడం గత రెండు దశాబ్దాలుగా జరుగుతోంది. కొనేళ్లుగా రాజకీయంగా ఆధిపత్యం కోసం తరచూ ఘర్షణలు పడటం, బాంబు దాడులు, హత్యా సంఘటనలు కొనసాగుతున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ప్రత్యర్థి పార్టీని లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగించడం పరిపాటిగా మారింది. గత పదేళ్లకాలంలో టిడిపి, వైసిపి మధ్య రాజకీయ ఘర్షణలు జరుగుతున్నాయి.

2019లో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టిడిపి నేతలు, కార్యకర్తలు లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగాయి. గత ఐదేళ్లలో వైసిపి ఎమ్మెల్యేలు, నాయకుల దాడుల వల్ల నష్టపోయిన టిడిపి వారు ఆగ్రహంగా ఉన్నారు. ఈ విషయం గ్రహించిన వైసిపి వారు గ్రామాలను విడిచి వెళ్లారు. ఈ ఏడాది మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున, తరువాత రెండు రోజుల పాటు జరిగిన అల్లర్లు జరిగాయి. టిడిపి, వైసిపి రెండు పార్టీల వారు కూడా ఎవరికి అవకాశం ఉన్నచోట వారు ప్రత్యర్థులపై దాడులకు తెగబడ్డారు. మాచర్ల, గురజాల, నర్సరావుపేట, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ఘర్షణలు ఎక్కువగా జరిగాయి. దీంతో పల్నాడు జిల్లాలో దాదాపు నెల రోజులపాటు 144 సెక్షన్ కొనసాగించారు. 25 కంపెనీల పారా మిలటరీ బలగాలను గ్రామాల్లో బందోబస్తుకు వినియోగించారు. గత నెల 4వ తేదీన ఫలితాలు వచ్చిన తరువాత ఏ పార్టీ గెలిస్తే ప్రధాన ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడే అవకాశం ఉందని నిఘావర్గాలు హెచ్చరించడంతో దాదాపు నెలరోజుల పాటు బలగాలను కొనసాగించారు. పూర్తిస్థాయిలో కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో బలగాలు వెనక్కి వెళ్లిపోయాయి. ప్రస్తుతం పలుగ్రామాల్లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. రాజకీయ ప్రత్యర్థులు దాడి చేస్తారని భయపడిన వారు గ్రామాలు విడిచివెళ్తున్నారు.

ఆచూకిలేని మాచర్ల నేతలు

ఎన్నికల రోజు, అనంతరం జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు అయి నెల్లూరు జైలులో ఉన్నారు. రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి, మాచర్ల మునిసిపల్ మాజీ ఛైర్మన్ తురకా కిషోర్, టిడిపి నాయకులు మన్నెయ్య, బూడిదశ్రీను, చింతా శివరామయ్య, ఆదినారాయణ, ఉమమహేశ్వ రరెడ్డి గత రెండు నెలలుగా మాచర్ల నియోజకవర్గానికి దూరంగా ఎటో వెళ్లిపోయారు.

ఎవరిపైనా దాడులు చేయం : యరపతినేని

పల్నాడు గ్రామాల్లో ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని ఎవరిపైనా దాడులు జరగవని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. ఎవరికైనా భయం ఉంటే తమను సంప్రదించాలన్నారు. ఎవ్వరూ గ్రామాలు విడిచి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. దాడులు చేయడం తమ పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధమన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలు

(మొదటి పేజీ తరువాయి)

సిసిఆర్‌సి కార్డుల జారీ నిబంధన వల్ల కౌల్దార్లకు నష్టం జరుగుతోందని, ఈ నిబంధనను ఎత్తేసి కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయడంతోపాటు పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ పథకాలు వర్తింపజేయాలని కోరారు. స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై గతంలో దాడులు జరగలేదని, ఈ సంస్కృతిని వైసిపి తీసుకురాగా అదే కక్షపూరిత విధానాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వమూ అమలు చేస్తోందని మండిపడ్డారు. వేధింపులు, దాడులను ఆపకుంటే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కొత్త సమస్యలను సృష్టిస్తున్నాయని, సమగ్రాభివృద్ధినే విస్మరించాయని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో భాగమైన బిజెపిని రాష్ట్ర ప్రయోజనాలను విస్మరిస్తోందని, దీన్ని టిడిపి, జనసేనలు ప్రశ్నించడం లేదని విమర్శించారు. ప్రత్యేక హోదా, పోలవరం, విశాఖ ఉక్కుపై కేంద్రాన్ని సిఎం చంద్రబాబు ప్రశ్నించాలన్నారు. బిజెపితో సన్నిహితంగా ఉండే పార్టీలను ఆ పార్టీ మింగేయడం ఖాయమనే విషయాన్ని బిజెపితో అంటకాగే పార్టీలు గుర్తించాలని సూచించారు. సమావేశంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు డి.శివకుమారి, టి.పెద్దిరాజు, సిలార్ మసూద్, ఎవికె దుర్గారావు, కె.నాగేశ్వరరావు, ఎం.ఆంజనేయులు, డి.సుభాష్‌చంద్రబోస్, నాగమ్మబాయ్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో వివాహిత ఆత్మహత్య కు పాల్పడింది. స్థానిక ఐతానగర్ లింగారావు సెంటర్కు చెందిన షేక్ ఆష(34) ఆదివారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి విచారణ చేపట్టారు.

తల్లీకొడుకుపై హత్యాయత్నం ఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన ఏఎస్పి

ప్రజాశక్తి-ఈపూరు

గర్భిణీ, ఆమె కుమారుడుపై హత్యాయత్నం చేసిన ప్రాంతాన్ని పల్నాడు జిల్లా ఏఎస్పీ లక్ష్మీపతి ఆదివారం పరిశీలించారు. నిందితుడు చంపిన అనంతరం పూడ్చేందుకు తీసిన గోయ్యిని పోలీసులు పరిశీలించారు.గర్భిణి శైలజ, ఆమె కుమారుడు,శివ లను పోలీస్ స్టేషన్ నుండి ఘటన ప్రాంతానికి తరలించి హత్యాయత్నం జరిగిన తీరును ఏఎస్పీ తెలుసుకున్నారు. అలాగే, బాధితులను ఘటనా సమయంలో రక్షించిన పవర్ ప్లాంట్ లోని వ్యక్తుల ను విచారించారు.అనంతరం బాధితులు, సాక్షుల వాంగ్మూలాలను పోలీసులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో వినుకొండ రూరల్ సిఐ యు.సుధాకర్ మాట్లాడుతూ నిందితుడు ముద్దా శ్రీను గాలింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, త్వరలోనే నింతుడిని పట్టుకుంటామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ షేక్ మహమ్మద్ ఫిరోజ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ తుళ్లూరు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - తుళ్లూరు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తుళ్లూరు మండల కమిటీని ఎన్నుకున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్ గోపీచంద్,బి బాబు, ఉపాధ్యక్షులుగా ఎన్.హర్షవర్ధన్, పి.సుభాష్,సహాయ కార్యదర్శులుగా ఎల్ బాబి, కె. పూర్ణ ఆకాష్ ఎన్నికయ్యారని చెప్పారు. రాజధాని ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఉచితంగా సీట్లు కేటాయించాలని,ఆ నిబంధనతోనే రైతుల దగ్గర భూములను స్వీకరించారని గుర్తు చేశారు. నేడు బిటెక్ కౌన్సిలింగ్ జరుగుతున్న తరుణంలో ఇక్కడున్న విట్, ఎస్ఆర్ఎం,అమత యూనివర్సిటీ లలో రాజధాని ప్రాంత విద్యార్థులకి ఉచితంగా 10 శాతం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.తుళ్లూరు పరిసర ప్రాంతాల్లో స్కూల్స్,కాలేజీలను అభివృద్ధి చేయాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా పూర్తి స్థాయిలో పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు రాలేదని, కిట్లను అందించలేదని విమర్శించారు. ప్రభుత్వం,అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందించాలని డిమాండ్ చేశారు. డిగ్రీ ఆన్లైన్ అప్లికేషన్ వల్ల ఎక్కువ మంది విద్యార్థులు నష్టపోతున్నారని వెంటనే ఆన్ లైన్ అప్లికేషన్ ప్రక్రియను రద్దు చేయాలని, జీవో నెంబర్ 77ని రద్దుచేసి ఉన్నత విద్య చదివేందుకు విద్యా ర్థులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ,నాయకులు వినయ్,బి రామ్ చరణ్, సాయి నాయక్, శశాంక్,రాఘవ, పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొట్టిన కారు - బాలుడు మృతి

- మంగళగిరి పరిధిలోని తెనాలి ఫ్లై ఓవర్ వద్ద ప్రమాదం
- ఆ మార్గంలో ప్రయాణిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి సవిత
- క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలకు ఆదేశం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణ పరిధిలోని తెనాలి ఫ్లైఓవర్ వద్ద బైపాస్ రోడ్ లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 15 నెలల బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా తోట్ల వల్లూరుకి చెందిన వై.గణేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో గుంటూరు వెళుతున్నారు.అటువైపే వెళుతున్న కారు, వారి ఆటోను కొట్టింది.ఈ ప్రమాదంలో పదిహేను నెలల బాలుడు వెంకట్ తాత్విక్ అక్కడికక్కడే మృతి చెందాడు. గణేష్ భార్య లక్ష్మి, ఆటో డ్రైవర్కు తీవ్ర గాయాలయ్యాయి. ఇదిలా ఉండగా,అటువైపే వెళుతున్న బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఈ ప్రమాద ఘటనను గమనించి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గణేష్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరుగు, జీవితం రెండు ఒక్కటే

ఎమ్మెల్యే గల్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పరుగు, జీవితం రెండు ఒక్కటేనని, ముందుకు సాగిపోవాలి కానీ, ఆగిపోకూడదని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆదివారం డీయన్ఐ సంస్థ ఆధ్వర్యంలో 5కే రన్ను ఎమ్మెల్యే గళ్ళా మాధవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ 5 కే రన్ నవభారత్ నగర్ నుండి విద్యానగర్ కొరిటెపాడు, లక్ష్మీపురం, గార్డెన్స్, గుజ్జనగుండ్ల మీదుగా నవ భారత్ నగర్ కు చేరుకుంది.అనంతరం బెలూన్లను గాలిలోకి వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యినందుకు చాలా ఆనందంగా ఉంది. ఎవరి ఆరోగ్యం వారి చేతిలో ఉంటుందని, మెడిసిన్కు దూరంగా ఉండాలంటే వాకింగ్, రన్నింగ్, యోగా చేయాలన్నారు. మితమైన ఆహారం తీసుకోవాలని, ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని, ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండాలంటే ప్రతిరోజు వ్యాయాయం చేయాలని సూచించారు.

పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే పలకరింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదివారం పలకరించారు. వారి సమస్యలను ఆలకరించారు. స్థానిక విద్యానగర్లో ఓ కార్యక్రమానికి హాజరయ్యి,వెళ్తున్న క్రమంలో పారిశుధ్య కార్మికులను చూసి కారును ఆపి వారిని పలకరించారు.ఈ సందర్భంగా వారి బాగోగులు తెలుసుకున్నారు. వారు తాము ఎదుర్కొంటున్న సమస్యలు ఎమ్మెల్యే దష్టికి తీసుకొని వచ్చారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నదని,

తగినంత మంది సిబ్బంది లేక పోవటంతో ఆ పనిభారం మొత్తం ఇతర సిబ్బంది మీద పడుతున్నదని ఎమ్మెల్యే గళ్ళా మాదవితో తమ గోడు వెళ్లబోసుకున్నారు. అధికారులతో మాట్లాడి మీ సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు.ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరావు, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

'ప్రజలను మభ్యపెడుతున్న కూటమి ప్రభుత్వం'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం మభ్యపెడుతుందని చేసిన వాగ్దానాలకు అమలు చేస్తున్న జిఓ లకు చెబుతున్న మాటలకు పొంతన లేదని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం గుంటూరు రోడ్డులోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అమ్మఒడి ప్రవేశపెట్టి 45 లక్షల మంది తల్లులకు 4 విడతలలో రూ 6 వేల కోట్లకు పైగా అందించామన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు తల్లికి వందనం పేరిట తల్లికి ఉన్న బిడ్డలందరికి ఇస్తామని హామీ ఇచ్చారని దీనిపై ఇటీవల జిఓ నెం.29 విడుదల చేసిన కూటమి ప్రభుత్వం జిఓ లో ఒక బిడ్డకు మాత్రమేనని ఉందని దీనిపై వైసిపి ప్రశ్నిస్తే కూట మికి చెందిన ఒక మంత్రి ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని చెబుతున్నారని, విద్యాశాఖ మంత్రి లోకేష్ మాత్రం దీనిపై ఇంతవరకు నోరు మెదపలేదన్నారు. జిపిఎస్ అమలుకు జిఓ నెం.54 విడుదల చేశారని వైసిపి 2023 లో పొందుపరిచిన అంశాల మేరకు విధా నాలు ఉన్నాయని దీంతో మోసపోయిన ఉపాధ్యాయులు ఇప్పటికే రోడ్డెక్కారన్నారు. ఉచిత ఇసుక విధానం బూటకమని వైసిపి హయాంలో టన్ను ఇసుక రూ.600కు లభించిందని ప్రస్తుతం రూ.700 ధర పలుకుతుందని లబ్ధిదారులకు తక్కువ ధరకు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పెన్షన్ పెంపు అంటూ గొప్పలు చెప్పు కుంటూ లబ్ధిదారులను కుదిస్తున్నారని నరసరావుపేట నియోజకవర్గంలో ఇప్పటికే 39 మంది వైసిపి సానుభూతిపరుల పేరిట పెన్షన్ నిలుపుదల చేశారని గతంలో 39 లక్షల మంది పెన్షన్ దారులు ఉండగా వైసిపి అధికారంలోకి వచ్చాక 26 లక్షల కొత్త పెన్షన్లు కుల మత పార్టీలకతీతంగా వాలంటీర్ల ద్వారా ఇంటింటికి పంపిణీ చేశామన్నారు. లబ్ధిదారులకు తప్పనిసరిగా పెన్షన్ ఇవ్వాలని ఆయా హామీల అమలుకు అవసరమైతే రోడ్డెక్కి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

తెలప్రోలులో ఘర్షణ ఒకరికి కత్తిపోట్లు

ప్రజాశక్తి -తెనాలి

ఇరువర్గాలు ఘర్షణ పడిన నేపథ్యంలో ఓ వ్యక్తి కత్తి పోట్లకు గురయ్యాడు. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం తెలప్రోలు సర్పంచ్ బాషా, అదే గ్రామానికి చెందిన అరాఫత్ రెండు వర్గాలుగా ఉన్నారు. ఆదివారం ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో అరాఫత్ వర్గానికి చెందిన ఫయాజ్ కు కత్తి గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఇరు వర్గాలు వైసిపి కి చెందిన వారేనని కొందరు ఆరోపిస్తుంటే, సర్పంచ్ వర్గం వైసీపీకి చెందినదని, అరాఫత్ జనసేన వర్గానికి చెందిన వారని చెబుతున్నారు. గతంలోనూ ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగిందని పోలీస్ కేసులు కూడా నమోదైనట్లు సమాచారం. తాజాగా జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి నాయకుని కారు అద్దాలు ధ్వంసం

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణం మూడో వార్డు నెహ్రు నగర్ రెండవ లైన్ కు చెందిన టిడిపి నేత బి చంద్రారెడ్డి కారు అద్దాలను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టారు. సేకరించిన వివరాల ప్రకారం చంద్రారెడ్డి తన కారును రాత్రి పది గంటల సమయంలో ఇంటికి దగ్గరలోని వాటర్ ప్లాంట్ సమీపంలో ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అతని కారు వెనక అద్దాలను పగలగొట్టారు. ఈ మేరకు చంద్రారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కారు అద్దాలను పగలగొట్టడం, ధ్వంసం చేయడం, మోటార్ సైకిళ్లు తగలబెట్టడం మాచర్లలో ఇది ఒక విష సంస్కృతిగా మారింది. దాన్ని అధికారులు పోలీసులు అరికట్టడంలో విఫలమవుతున్నారు.

ఉద్యోగ విరమణ అభినందన సభ

ప్రజాశక్తి-వినుకొండ

ఉత్తమ ఉపాధ్యాయుడు విసిహెచ్ రామాచారి ఉద్యోగ విరమణ అభినందన సభ వినుకొండలోని విఎల్ఎస్ కళ్యాణ మండపం లో వైభవంగా నిర్వహించినట్లు బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బివి నాగేశ్వరావు తెలిపారు. సభాధ్యక్షులు న్యాయవాది పిజె లూకా మాట్లాడుతూ రమాచారి ఉత్తమ ఉపాధ్యాయునికి ఉండవలసిన లక్షణాలు అంకిత భావం, క్రమశిక్షణ, దీక్ష దక్షతలు పుష్కలంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు, మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు, బోడెపూడి హనుమయ్య మాట్లాడుతూ విద్యార్థులలో పోటీ తత్వం పెంపొందించడమే గాక పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనటం ఆనంద దాయకమని కొనియాడారు. రామాచారి ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులు నడిగడ్డ గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవి కేజే రమేష్, ఎన్ఆర్ హనుమంత ఆచారి, రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయుడు సురేష్ , ఎంఈఓ లు ఎం సాంబశివరావు, ప్రసన్న పాల్గొన్నారు.

వానాకాలం.. వ్యాధుల భయం..

- సీజనల్ వ్యాధులు.. డెంగీ, మలేరియా, డయేరియా జ్వరాలు సోకే సమయం
- ఆరోగ్య శాఖ ముందస్తు ప్రణాళికలు
- పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

నరసరావుపేట నుండి మురుగు నీరు బయటకు పోయే ప్రధాన కాలువలో చెత్తాచెదారం, మల్లమ్మ సెంటర్‌లో మురుగు నీరు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వానా కాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ముసురుకోనున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలితే ప్రజలు ఆరోగ్య పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వర్షాలు గాలి, నీరు, వాతావరణ మార్పుల వల్ల దోమలు, ఈగలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, డయేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్, జలుబు, మెదడు వాపు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ వ్యాధుల నివారణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది.

పల్నాడు జిల్లాలో గత 3 రోజుల నుండి జోరుగా వర్షాలు కురుస్తుండడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని చలి గాలులు వీచి తేమ శాతం పెరుగుతోంది. వర్షపు నీరు పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉండడం, మురుగు పేరుకుపోవడం, చెత్తాచెదారం పోగవ్వడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పట్టణాల్లో ఎంత శుభ్రం చేసినా లోతట్టు ప్రాంతాల్లో, మురుగు కాల్వలలో , వరద నీరు నిలుస్తుంది. మురుగు కాల్వలలో, చెత్తలో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దోమలు, ఈగలు, ఇతర బ్యాక్టీరియాల నివారణకు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు తగు చర్యలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కలుషిత ఆహారం తీసుకోకూడదు. గాలి, నీరు, వాతావరణం, ఆహారం విషయంలో జాగ్రతలు పాటించాలని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

డాక్టర్ బి.రవి, పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

పిడుగురాళ్లలో డయేరియా ప్రస్తుతం అదుపులో ఉంది. బాధితులకు మెరుగైన చికిత్స అందిస్తున్నాం. 20 మందికి పైగా అదనంగా వైద్యులను నియమించి 24 గంటలు అప్రమత్తంగా ఉన్నాం. సీజనల్ వ్యాధుల నివారణ కోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశాం. వ్యాధులకు కారణమయ్యే దోమలు, ఈగలు, బ్యాక్టీరియా వ్యాప్తి చెందకుండా వైద్య ఆరోగ్య శాఖ పరంగా చర్యలు తీసుకుంటున్నాం. పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల బారిన పడితే చికిత్స పొందేందుకు ఉన్న సదుపాయాలను కరపత్రాలు, వాల్ పోస్టర్ల ద్వారా ప్రచారం చేశాం. వ్యాధులు ప్రబలేందుకు అవకాశమున్న ప్రాంతాలను గుర్తించి పరిసరాలను శుభ్రం చేయడం, బ్లీచింగ్, నివారణ మందులు పిచికారి చేయించాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు విలేజ్ హెల్త్ క్లినిక్ లు గ్రామ పంచాయతీల సమన్వయంతో వ్యాధులు ప్రబలిన ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నాం. జిల్లాలో ప్రస్తుతం సీజనల్ వ్యాధుల ప్రభావం లేదు. జులై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు ప్రజలు జాగ్రతలు తీసుకోవాలి. వైద్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉంటూ సీజనల్ వ్యాధులకు సంబంధించి ఏ చిన్న లక్షణం కనిపించినా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించి వైద్యుల సూచన మేరకు చికిత్స పొందాలి. డెంగీ ఎక్కువగా ప్రబలితే డెంగీ నిర్ధారణ కిట్లు, బ్లడ్ బ్యాంకులు, కంపోనెంట్ ఆపరేటర్లు నిత్యం అందుబాటులో ఉన్నారు.

డయేరియా: డయేరియా బారినపడినప్పుడు విరేచనాలతో పాటు జ్వరం, వాంతులవడం, దాహం ఎక్కువ కావడం జరుగుతుంది. నీరసం, గుండె దడ, నోరు ఎండిపోవడం, చర్మం పొడిబారిపోవడం, కడుపునొప్పి లక్షణాలు కనిపిస్తాయి. పైలక్షణాలు ఉంటే తక్షణమే వైద్య సేవలు పొందాలి.

టైఫాయిడ్: కలుషితమైన ఆహారం, కలుషితమైన నీరు తీసుకోవడం ద్వారా టైఫాయిడ్ బారినపడతారు. ఈ బ్యాక్టీరియా ప్రేగునాళాల ద్వారా వ్యాపించి ప్రేగు గోడల్లోకి చొచ్చుకొని పోయి రక్తంలో ప్రవేశిస్తుంది. టైఫాయిడ్ జ్వర లక్షణాల్లో జ్వరం 104 డిగ్రీ ఉండి తగ్గకపోవడం, విపరీతమైన చెమటలు పట్టడం, గ్యాస్ట్రో సమస్యలు, రక్త విరేచనాలు అవుతాయి.అతి తక్కువ సందర్భాలలో సరైన సమయంలో చికిత్స పొందని టైఫాయిడ్ జ్వరంతో మరణం కూడా సంభవించే అవకాశం ఉంటుంది.

మలేరియా: మలేరియా దోమల ద్వారా వ్యాప్తి చెంది రక్తంలో పరాన్నజీవులు చేరినప్పుడు మలేరియా సోకుతోంది. పరాన్నజీవులు తమ ఆహారం కోసం తాము నివసిస్తున్న మనిషిపైనే ఆధారపడతాయి. మనిషిని కుట్టినప్పుడు లాలా జలాల్ని వదులుతుంది. ఆ లాలా జలంలో స్పోరోజాయిట్స్ ఉంటాయి. అవి మనిషి శరీరంలోకి ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి అవి విరోజాయిట్స్ కాలేయం, ఎర్రరక్త కణాల్లో పరిణతి చెందుతాయి. ఇలా పరిణతి చెందిన మీరోజాయిట్స్ ద్వారా వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. అన్ని దోమలు మలేరియా ను వ్యాప్తి చేయవు. కేవలం అనోఫిలస్ అనే జాతి దోమ వల్ల మాత్రమే మనుషులకు మలేరియా సోకుతుంది. గర్భంలో ఉన్న శిశువులకు తల్లి నుండి, వ్యాధిగ్రస్తుని రక్తం ఎక్కించడం వల్ల కూడా వ్యాపిస్తుంది. మలేరియా సోకిన వాళ్లకు వాడిన సిరింజి వాడకం ద్వారా కూడా మలేరియా బారిన పడతారు.

మెదడు వ్యాపు వ్యాధి: జపనీస్ బీవైరస్ అనే సూక్షజీవి దోమల ద్వా రా ఈ వ్యాధి సోకుతుంది. పందులు, పశువులు, పక్షుల్లో వైరస్ స్థావ రాలుంటాయి. వీటిని కుట్టిన దోమలు మనిషిని కుడితే వ్యా ప్తి చెందు తుంది. ఈ వ్యాధి సోకిన వారిలో మూడో వంతు మంది ప్రాణాప్రాయ పరిస్థితికి వెళ్తారు. పక్షవాతం, జ్ఞాప కశ క్తి కోల్పోవడం, బుద్ధి మాంద్యం, వినికిలోపం, దష్టిలోపం వంటి అంగవైకల్యాలతో జీవితాంతం బాదపడాల్సి వస్తుంది వెంటనే వైద్యుల్ని సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలి.

డెంగీ : పగటి పూట మాత్రమే కుట్టే ఎడిస్ ఈజిప్ట్ దోమకాటుతో డెంగీ బారిన పడతారు.ఈ దోమ కుట్టినప్పుడు శరీరం మొత్తం దురద, దద్దుర్లు వస్తాయి. ఈ దోమ కుట్టడంతో వైరల్ జ్వరం మాదిరి గానే ఆకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తలనొప్పి, ఒళ్లునొప్పులు, కీళ్ల నొప్పులుతో ఎముకలు విరిగేంత నొప్పి కలిగినట్లు అనిపిస్తుంది. ఉదరభాగాల, చర్మంపై ఎర్రగా కందినట్లు చిన్న చిన్న మొటిమలు కని పిస్తాయి. పేట్లేట్స్ తగ్గిపోయి రోగి పరిస్థితి విషమంగా మారుతుంది.

చికున్ గున్యా: చికెన్ గున్యా అనేది ఒక వైరస్ వ్యాధి. ఇది ఏడెస్ అనే దోమా కాటుతో చికెన్ గున్యా సోకుతుంది. వ్యాధి సోకిన రోగికి తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు వస్తాయి. కొన్ని రోజుల పాటు తీవ్ర జ్వరం ఉంటుంది. కొన్ని సందర్భాలలో జ్వరం తీవ్రత తగ్గినా కీళ్లనొప్పులు తగ్గవు.

పారిశుధ్య సమస్యను వెంటనే పరిష్కరించండి

సిపిఎం డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న ధరణికోట విమల

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణంలో పారిశుధ్య సమస్యను వెంటనే పరిష్కరించాలని, డయేరియా వంటి వ్యాధులు వ్యాపించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల అన్నారు. ఆదివారం స్థానిక కొత్తపేటలో జరిగిన 21వ శాఖ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి దామర్ల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. విమల మాట్లాడుతూ పట్టణంలో మురుగుతో, కాల్వలు నిండి ఉన్నాయని, చిన్న పాటి వర్షానికే రోడ్లు బురద మయవుతున్నాయని అన్నారు. దీంతో పట్టణ ప్రజలకు రకరకాల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంద ని హెచ్చరించారు. ఇటీవల గుంటూరు, దాచేపల్లి, పిడుగురాళ్ల వంటి పట్టణాల్లో డయేరియా వ్యాధి వ్యాపించి ప్రజలు చనిపోయిన విషయాన్ని ఆమె ప్రస్తావించారు. పట్టణంలో పారిశుధ్య చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పట్టణం లోని 21, 22 వార్డులకు సంబంధించిన వార్డు సచి వాలయాన్ని 23వ వార్డులో ఆవార్డు ప్రజలకు సంబంధంలేని వెంకటపతి కాలనీలో ఏర్పాటు చేశారని విమర్శించారు. ఈ రెండు వార్డులలో ప్రజలు ఏమైనా సమస్యలు చెప్పుకోవాలంటే వాగు దాటి ఆ వార్డుకు వెళ్లడం చాలా ఇబ్బందికరంగా ఉందని అన్నారు. ఆ సచివాలయాన్ని 21, 22 వార్డుల ప్రజలకు అందుబాటులో ఉండేలా 21వ వార్డులోకి మార్చాలని గతంలో మున్సిపల్ అధికారులకు, పై అధి కారులకు వినతిపత్రం అందజేసినా ఫలితం లేదన్నారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు అవ్వారు ప్రసాద్ రావు మాట్లాడుతూ పేరేచర్ల నుండి కొండమోడు వరకు జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, అందులో భాగంగా సత్తెనపల్లి పట్టణానికి సమీపంలో నిర్మించే బైపాస్ రోడ్డు కోసం ప్రభుత్వం సేకరిస్తున్న భూములకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లి స్తేనే ఇక్కడ రోడ్డు వేయనిస్తామని అన్నారు. ఈ రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు రూ.15 లక్షలు లేదా రూ.20 లక్షలు ఇచ్చి చేతులు దులుపు కోవాలని చూడటం అన్యాయమన్నారు. ఆ ప్రాంతం పట్ట ణానికి సమీపంగా ఉండటంతో ఎకరం రూ.50 లక్షల నుండి కోటి రూపాయల వరకు ధర పలుకుతోందని చెప్పారు. ఇళ్ల స్థలాల కోసం తీసుకునే భూములకు సెంటు రూ.5 లక్షల నుండి రూ.10 లక్షల వరకు ధర పలుకు తోందని అన్నారు. కానీ బైపాస్ రోడ్ లో భూములు కోల్పోయిన రైతులకు మాత్రం ప్రభుత్వం ఆ భూములను వ్యవసాయ భూములుగా పరిగణించడం అన్యాయ మన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారా యణను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బాధిత రైతులు, సిపిఎం నాయకులు కలిసి వినతిపత్రం అందజేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెలే, నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవ రాయలు, సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, పట్టణ కమిటీ సభ్యులు షేక్ సాయిబా, శాఖ సభ్యులు పి.రామారావు, డి వెంకటేశ్వర్లు, డి పుల్లారావు, ఎ.వెంకట నారాయణ, పి.శివపార్వతి, సిహెచ్ వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక శాసన సభ్యులు పత్తిపాటి పుల్లారావు పౌర సేవల పట్ల అప్రమ త్తంగా ఉండలని మున్సిపల్ అధికా రులను ఆదివారం అదేశించారు. దీంతో పట్టణంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా పై మున్సిపల్ అధికారు లు దృష్టి సారించారు. గత రెండు రోజులుగా ఒక మోస్తరుగా కురు స్తున్న వర్షంలో సైతం మున్సిపల్ అధికారులు, పని వార్లు ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. గత పాలకుల నిర్వాకంతో ఆహ్లాదకర వాతావరణంలో ఉండే పెదనందిపాడు రోడ్డులోని శ్మశాన వాటిక పరిసర ప్రాంతాలు మిని డంపింగ్ యార్డుగా మారటంతో శ్మశాన వాటిక పరిసర ప్రాంతాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదేశాలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణారావు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని దాదాపు అన్ని వీధులలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు.

రెడీమేడ్ దుకాణాల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని రెడీమేడ్ వస్త్ర దుకాణాల నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో రెడీమేడ్ దుకాణాల అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షునిగా వందనపు శేషగిరిరావు, ఉపాధ్యక్షుడిగా చాట్రగడ్డ సాయిరాం మోహన్, సెక్రటరీగా పతంగి అమర్, ట్రెజరర్ గా గుడివాడ సురేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎపి వర్క్ ఛార్జ్ ఎంప్లాయిూస్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి

నాగార్జునసాగర్ ప్రాజెక్టు సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని అమరావతి, సత్తెనపల్లి, నకరికల్లు తాలూకా యూనిట్ బ్రాంచిల వర్క్ చార్జ్ ఉద్యోగుల ఎన్నికలు సత్తెనపల్లి డివిజన్ కార్యాలయంలో ఆదివారం జరిగాయి. అమరావతి తాలూకా యూనిట్ బ్రాంచ్ అధ్యక్షులు గా ఎమ్.మరియదాసు, ప్రధాన కార్యదర్శి గా బి.రాజు, కోశాధికారిగా షేక్ ఆదం సాహేబ్ ఎన్నికయ్యారు. సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షులు గా జె.నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శిగా టి.శ్రీనివాసరావు కోశాధికారిగా బ్రహ్మానందంను ఎన్నుకున్నారు. నకరికల్లు తాలూకా యూనిట్ కి జరిగిన ఎన్నికల్లోఅధ్యక్షులుగా ఎస్ శం కరరావు ప్రధాన కార్యదర్శిగా యు.శ్రీనివాసరెడ్డి కోశాధికారిగా ఎ.హనుమంతరావు ఎన్నికయ్యారు.

పెండింగ్ జీవోలు విడుదల చేయాలి

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్రకార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ కార్మికులు 16 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన పెండింగ్ జీవోలు వెంటనే జారీ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపుదలకు 9 మంది అధికారులతో నియమించిన కమిటి నివేదికను ఆమోదించి జీతాలు పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వెహికల్‌షెడ్ విభాగం కమిటి విస్తృత సమావేశం బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో కమిటీ ప్రధాన కార్యదర్శి వై.ప్రభుదాసు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 2023 డిసెంబర్‌లో 16 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సిఐటియు అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం నాయకత్వంలో సమ్మె చేసి కొన్ని హక్కులు సాధించుకున్నారని తెలిపారు. పారిశుధ్య కార్మికులతోపాటు చెత్త తరలించే వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజి కార్మికులకు కూడా హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని సిఐటియు అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చిందని, ఎన్నికలకు ముందు సమ్మె చేయటంతో డ్రైవర్లు, క్లీనర్లు, యుజిడి కార్మికులకు జీతాలు పెంచారని అన్నారు. సమ్మె సందర్భంగా మంత్రులు, అధికారులతో జరిగిన చర్చల్లో సిఐటియు కృషి ఫలితంగా ఇంజినీరింగ్ కార్మికులకు జీతాల పెంపుదలకు సంబంధించి 9 మందితో కమిటి వేశారని, ఆ కమిటీకి తాము అనేక అనే ప్రతిపాదనలు అందించామని తెలిపారు. కమిటీ ప్రభుత్వానికి అందించిన నివేదికలో కొన్ని లోపాలు ఉన్నాయన్నారు. అయితే కమిటీ నివేదిక రాష్ట్ర ఆర్థిక శాఖ వద్దే పెండింగ్‌లో ఉందని, వెంటనే నివేదిక ఆమోదించి, ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. 'క్లీన్ ఎన్విరాన్‌మెంట్ కార్మికులకు' సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు సంబంధించి పెండింగ్ జీవోలు విడుదల చేయాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్, అంగన్‌వాడీ, సమగ్ర శిక్ష, ఆశా తదితర రంగాల్లో కార్మికులు సమ్మెలు చేశారని, ఆ సమ్మెలకు సిఐటియు నాయకత్వం వహించిందని గుర్తు చేశారు. సిఐటియు నాయకత్వంలో కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించటం ద్వారా హక్కులను సాధించుకోవచ్చని మున్సిపల్ కార్మికులు రుజువు చేశారని అన్నారు. సమావేశంలో ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నగర అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మినారాయణ, జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, నగర (తూర్పు) కమిటి ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, నగర (పశ్చిమ) కమిటి అధ్యక్షులు బి.సత్యనారాయణ, వెహికల్ షెడ్ కమిటి సభ్యులు జి.శ్రీనివాసరావు, కె.మరియదాసు, జశ్వంత్, రెహమాన్, సిహెచ్ బాలప్రసాద్, ప్రకాష్, శ్రీనివాస నాయక్, ప్రభు, రామకృష్ణ, నరేంద్ర, ప్రవీణ్, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ఎదురూ లేదు... బెదురూ లేదు..

మాకు మేమే పోటీ!

కావలసినంత అల్లరి..ఆటపాటలు..ఆ అక్కా చెల్లెళ్ల సొంతం. వారి అల్లరిని ఆ తల్లిదండ్రులు ఎంతో ముద్దుగా ఆస్వాదించేవారు. వారికి ఏనాడూ ఆంక్షలు విధించలేదు. అలాగని వారి అల్లరిని శృతిమించనీయలేదు. వాటితో పాటు చదువూలోనూ పోటీతత్వాన్ని ప్రదర్శించాలని మాత్రం గుర్తు చేస్తుండేవారు. ఎంతోమంది విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉన్న తల్లిదండ్రుల పోత్రాహాన్ని వారు అందిపుచ్చుకున్నారు. ఒకరిని మించి ఒకరు అన్నట్లుగా లక్ష్యసాధనల్లో ముందడుగు వేశారు. ప్రతిష్టాత్మకమైన ఐఐటిల్లో సీట్లు సాధించి నేటి తరం విద్యార్థినులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. అల్లరిని మించి అన్నింటా పోటీలో కూడా వారికి వారే సాటి అనిపించుకున్న తెనాలి మండలం కొలకలూరుకు చెందిన అక్కాచెల్లెళ్లు పొన్నెకంటి ప్రణతి, సింధుప్రియ వివరాలను పరిశీలిద్దాం..

ప్రతిష్టాత్మకమైన ఐఐటిల్లో సీట్లు పొందిన అక్కా చెల్లెళ్లు

ప్రజాశక్తి-తెనాలి

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులపై మానసిక ఒత్తిడి ఎంతో ఉంటుంది. సామాజిక మాధ్యమాల ప్రభావం కూడా అధికమే. అలాంటి పరిస్థితుల్లో మంచి లక్ష్యాలను ఎంచుకుని, దానిని సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలంటే సరైన మార్గదర్శకులు ఉండాల్సిందే. వారిలో ప్రథములుగా తల్లిదండ్రులుంటే, వారి ప్రయత్నం నూరు శాతం విజయం సాధిస్తుందనటంలో సందేహం లేదని ఉపాధ్యాయ దంపతులు పొన్నెకంటి సురేష్‌బాబు, వాణి నిరూపించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో బదిలీలు, అననుకూల పరిస్థితులు సర్వసాధారణం. వాటిని అధికమించి, బిడ్డలకు బంగారు భవిష్యత్‌ను అందించాలన్న వారి సంకల్పం దిశగా అడుగులు వేస్తున్నారు. పిల్లల విద్యావసరాల దృష్ట్యా తెనాలి పట్టణంలో వారు నివాసం ఉంటున్నా, సురేష్‌బాబు పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఓల్డ్ యుపి) హెచ్‌ఎంగా, ఆయన భార్య వాణి సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయినిగా దుగ్గిరాల మండలం నల్లమేకలవారిపాలెంలో పనిచేస్తున్నారు. వారి ఇద్దరి కుమార్తెలూ ఐఐటిలో సీట్లు పొందటంపై వారి సంతోషానికి అవధులు లేవు.

అన్నింటా ప్రతిభ చూపిన అక్కా చెల్లెళ్లు

సురేష్‌బాబు, వాణి దంపతుల పెద్ద కుమార్తె ప్రణతి. చదువులో ఎంతో చురుగ్గా ఉండే ప్రణతి తెనాలి మిషన్ కాంపౌండ్‌లోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పదోతరగతి చదివి, 10/10 జిపిఏతో సత్తా చాటారు. ఇంటర్మీడియెట్ విజయవాడ నారాయణ క్యాంపస్, శ్రీవైష్ణవి భవన్‌లో చదివి 1000 మార్కులకు 967 మార్కులు సాధించారు. జెఈఈ మెయిన్స్‌లో క్వాలిఫై అయిన ప్రణతి జెఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1457 ర్యాంకు సాధించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ఐఐటి, గోవాలో సీటును కైవశం

తల్లిదండ్రుల ప్రోత్సాహంలో సివిల్స్ లక్ష్యంగా ముందుకు

చేసుకున్నారు. ప్రస్తుతం ఫైనలియర్‌కు చేరారు. రెండో కుమార్తె సింధుప్రియ ఏడో తరగతి వరకు సెయింట్ జాన్స్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్‌లో, ఎనిమిది నుంచి పదోతరగతి వరకూ తెనాలి కెకెఆర్ గౌతం స్కూల్‌లో చదివారు. పదోతరగతిలో 568 మార్కులతో అక్కకు పోటీగా సత్తా చాటి ఇంటర్మీడియెట్ విద్యను విజయవాడ నిడమానూరు నారాయణ శ్రీవైష్ణవి భవన్ క్యాంపస్‌లో చదివి, 984 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబరిచారు.. జెఈఈ మెయిన్స్‌లో క్వాలిఫై అయిన సింధుప్రియ జెఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1887 ర్యాంకు సాధించి, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఐఐటి జోధ్‌పూర్‌లో ఈ ఏడాది సీటు దక్కించుకున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఒకే ఇంట్లో అక్కా చెల్లెళ్లు ఐఐటిల్లో సీట్లు పొందటం, ఇద్దరూ కంప్యూటర్ సైన్స్ విభాగాలనే ఎంచుకోవటం వారి పోటీతత్వానికి నిదర్శనం. ప్రణతి ఈ ఏడాది ఫైనలియర్‌లో ఉండగా, తదుపరి సివిల్స్ లక్ష్యంగా చెబుతుండగా తాను మాత్రం తక్కువా అన్నట్లు సింధుప్రియ కూడా అక్కతోపాటే సివిల్స్‌కూ పోటీపడతానంటున్నారు.

ఆసిక్తిఉన్న రంగంలో ప్రోత్సహిస్తే..

ఆడపిల్లలన్న భావన మాలో ఏనాడు లేదు. వారి అల్లరిని ఆశ్వాదించాం. వారి ఇష్టాఇష్టాలను గౌరవించాం. చదవుకోసం హాస్టల్స్ ఉంచటానికి, దూరం పంపటానికి వెనకడుగు వేయలేదు. దానికి తగిన ధైర్యాన్ని నూరి పోశాం. అన్నింటా చురుగ్గా ఉండే ఇరువురికి పాఠశాల దశలో దిశానిర్దేశం చేశాం. అంతే.. దానికి అనుగుణంగా వారు కష్టపడ్డారు. టెన్త్‌లో ఒకరికి మించి ఒకరు అన్నట్లు పోటీ పడి మంచి మార్కులు సాధించారు. ఇంటర్‌లో ఏ గ్రూపు తీసుకోవాలి, భవిష్యత్ ప్రణాళిక ఏమిటన్నది వారి నిర్ణయానికి ప్రాధాన్యమిచ్చాం. ఇంటర్‌లోనూ, ఐఐటిలో సీటు పొందటంలోనూ వారికి వారే పోటిపడి విజయం సాధించారు. పిల్లల అభిరుచికి అనుగుణంగా ప్రోత్సహిస్తే వారు ఎంచుకున్న రంగంలో కచ్చితంగా రాణిస్తారు.

పొన్నెకంటి సురేష్‌బాబు, వాణి దంపతులు.

సివిల్ సర్వీసెస్‌కు పోటీ పడతాం

మా ప్రతి అడుగులోనూ తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంది. ఎంత గారాభంగా చూసేవారో అంత ప్రేమతో సున్నితంగా మందలిస్తారు కూడా. ఇద్దరూ ఉద్యోగంలో బీజీగా ఉన్నా మా చదువుల విషయంలో అలక్ష్యం చేయలేదు. మా అల్లరిని, పోటీ తత్వాన్ని చూసి మురిసిపోతుంటారు. ముఖ్యంగా చదువులో మా ఇష్టాన్ని గౌరవిస్తారు. అదే మాకు కొండంత ధైర్యం. ఇప్పుడు మేమిద్దరం ప్రతిష్టాత్మకమైన ఐఐటిల్లో సీట్లు పొందాం. భవిష్యత్‌లో మాలక్ష్యం సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావటం. ఇప్పటి వరకూ ఎలా పోటీ పడ్డామో సివిల్స్ లక్ష్యసాధనలోనూ అలానే పోటీ పడతాం.

ప్రణతి, సింధుప్రియ.

కమిటీ సభ్యులతో కళాశాల అధ్యాపకులు

టిజెపిఎస్‌ను సందర్శించిన నాక్ పీర్ కమిటీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపియస్ కళాశాలలో ఈనెల 11, 12వ తేదీలలో నాక్ పీర్ కమిటీ సందర్శించింది. డాక్టర్ గణేష్ చెంగలత్ (ఛైర్ పర్సన్ కేరళ), డాక్టర్ విలాస్ ఖరత్ (మెంబెర్ కోర్డినేటర్, పూణే), డాక్టర్ వెంకట రమణ (మెంబర్, తెలంగాణ) ఈ సందర్శనలో పాల్గొన్నారు. కళాశాలలోని అన్ని సౌకర్యాలను, విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమాలను, విద్యా సంబంధమైన అన్నింటినీ పరిశీలించి సంతృప్తి చెందారని కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ కె.వి.బ్రహ్మం తెలిపారు. కళాశాలలోని అన్ని విభాగాలను, ప్రయోగశాలలను, ఎన్ఎస్-ఎస్, ఎన్‌సిసి, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి వాటిని ప్రత్యేకంగా పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు పోలిశెట్టి శ్యాంసుందర్, ట్రెజరర్ వి.కృష్ణానంద్, కమిటీ సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ బిబిపి.మనోహర్, పిజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్ర, డాక్టర్ కామేశ్వరశాస్త్రి, వైస్‌ప్రిన్సిపాల్ భానుమురళి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ అనూష

ప్రజాశక్తి - మంగళగిరి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.అనూష సూచించారు. వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సీజన్ మారినప్పుడల్లా క్రిములు కూడా మారుతాయన్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, నీరు కలుషితం అవడం జరుగుతాయన్నారు. దీంతో నీటి నిల్వాలు వలన దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ వ్యాధులు, నీటి కలుషితం వల్ల కామెర్లు, వాంతులు, విరోచనాలు, టైఫాయిడ్ వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని చెప్పారు. చల్లగాలి తగిలినప్పుడు దగ్గు, జలుబు, గొంతులో ఇన్ఫెక్షన్, జ్వరంతో పాటు శరీరంలో కఫం తొందరగా బయటికి రాదని, కఫం లోపల ఉండటం వలన త్వరగా ఇన్ఫెక్షన్ చేరుతుందని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందని, జ్వరాలు ఎక్కువగా సోకే ప్రమాదం ఉందని అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, బయట ఆహారానికి దూరంగా ఉండి, ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని తీసుకోవాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, రోగ నిరోధక శక్తి పెరగడానికి సి విటమిన్ ఉన్న పండ్లు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి లక్షణాలు కనిపిస్తే సమీపంలోని హెల్త్ సెంటర్లో ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలను పొందాలని డాక్టర్ అనూష విజ్ఞప్తి చేశారు.

వృద్ధుల ఆశ్రమంలో ఉచితంగా కంటి పరీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక రామనాథం చిన్న కోటయ్య, శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంప్యూటర్ ద్వారా పరీక్షలు చేశారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి ఈనెల 21న ఆశ్రమంలో ఉచితంగా అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమం అధ్యక్షులు రామనాథం వెంకటేశ్వరరావు, రామనాథం పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి భార్య శోభారాణి అన్నారు. ఆదివారం వెల్దుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంజిరెడ్డి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోని ప్రజలు మెరుగైన వైద్య సేవలకు దూరంగా ఉన్నారని, వారికి వారి ప్రాంతాల వద్దకు వచ్చి పలు రకాల టెస్టులను ఉచితంగా నిర్వహించి సలహాలతో పాటు మందులు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజలకు నాణ్యమైన మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు.

ఉచితంగా రక్తనాళాల పరీక్ష వైద్యశిబిరం

సత్య సాయి సేవా సమితి పల్నాడు, మాచర్ల సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏషియన్ వాస్క్యులార్ హాస్పిటల్స్ సౌజన్యంతో మాచర్ల పట్టణంలోని సొసైటీ కాల నీలో సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో ఆదివారం నాడు ఉచిత రక్తనాళాల పరీక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా సత్యసాయి సేవా సంస్థల పల్నాడు జిల్లా అధ్యక్షులు ఉమామాధవ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారం భించారు. కాళ్లల్లో రక్త సరఫరా సరిగా లేకపోవడం, ఉబ్బి మెలి కలు తిరిగిన నరాలు ఉండటం, కాలు లేదా పాదములో వాపు, షుగర్ వ్యాధి వల్ల పుండ్లు ఉండటం, నరాలు లాగడం తిమ్మిర్లు వంటి సమస్యలతో బాధపడే 100 మంది పేషెం ట్లకు ఏషియన్ వ్యాస్క్యులర్ హాస్పిటల్ డాక్టర్ ప్రమోద ఆధ్వ ర్యంలో వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. అర్హులైన వారికి ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచితంగా లేజర్ ట్రీట్ మెంట్ ఇస్తామని డాక్టర్ ప్రమోద తెలిపారు. అక్కినేని అనిల్ కుమార్, జక్క శ్రీనివాసరావు, విద్య జ్యోతి, వీరాంజ నేయులు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

లివర్ సమస్య బాలికకు టిఎన్‌టియుసి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

లివర్ సమస్యతో బాధపడుతున్న బాలికకు టిఎన్ టియుసి ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థిక సాయం అం దించారు. ఈ సందర్భంగా టిఎన్‌టియుసి పట్టణ అధ్యక్షులు యరగని వెంకట మాట్లా డుతూ పట్టణంలోని నాలుగవ వార్డుకు చెందిన ఆటో టింకరింగ్ మేస్త్రి కూరెళ్ళ రాంబాబు మనవరాలు రమ్యకు 2016లో లివర్ సమస్యతో బాధప డుతుంటే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రమ్య ఆరోగ్య పరిస్థితిపై స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారా రూ. 15 లక్షల రూపాయలు ఇప్పించి వైద్య చికిత్స చేయించడం జరిగిందన్నారు. రమ్య ఆరోగ్యం మళ్లీ క్షీణిం చడంతో టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు అందించినట్లు చెప్పారు.

పిడుగురాళ్లలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని లెనిన్ నగర్, మారుతి నగర్‌ల నందు మున్సిపల్ అధికారులు పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శనివారం మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య సమస్యపై అధికారులపై ఆసహనం వ్యక్తం చేశారు. దీంతో ఉన్నాతిధికారులు సమస్యను పరిష్కరిం చేందుకు ఆదివారం పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల,దాచేపల్లి,పిడుగురాళ్ళ,సత్తెనపల్లి,నర్సరావుపేట, చిలకలూరిపేట మున్సిపాలటీల నుండి మున్సిపల్ కార్మికులను లెనిన్ నగర్,మారుతినగర్ ప్రాంతాలలో పనులను వేగవంతంగా నిర్వహించారు. సుమారుగా 250మంది కార్మికులు ఈ పనులలో పాల్గొన్నారని వారికి అన్ని భోజన సదుపాయాలు ఏర్పాటు చేసి పనులు త్వరతిగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని అధికారులు తెలిపారు.

అవమానాలను పట్టుదలగా మార్చుకున్నారు

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

గడిచిన ఐదేళ్ల కాలంలో జరిగిన అవమానాలను పట్టుదలగా మార్చుకొని కూటమి కార్యకర్తలు పనిచేసి విజయాన్ని అందించారని గురజాల ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని వల్లెల గార్డెన్స్‌లో టిడిపి,జనసేన,బిజెపి కూటమి శ్రేణుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అధికారం ఇచ్చింది అభివృద్ధి చేసేందుకు కానీ, అరాచకాలు చేయడానికి కాదని అన్నారు.

ఆ విధంగా చేస్తే ప్రజలు ఎలా బుద్ధి చెబుతారో గడిచిన ఎన్నికలే ఉదాహరణ అని అన్నారు. ఎన్నో అవమానాలు పడ్డ కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపుతామని, పడినచోటే వారిని నిలబెడతామని అన్నారు. ముప్పై ఏళ్లుగా తనను ఆదరిస్తున్న గురజాల నియోజక వర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, వారికి తన ధన్యవాదాలు తెలిపారు. మళ్ళీ జన్మంటూ ఉంటే గురజాల నియోజకవర్గంలోనే పుడతానని అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎవరూ దాడులకు పాల్పడవద్దని, తమను ఇబ్బంది పెట్టిన వారిపై చట్ట పరంగానే చర్యలు తీసుకుందామని అన్నారు. పిడుగురాళ్ళ మండల పరిధిలో కూటమికి మెజార్టీ రాదని అన్నారు కానీ, అక్కడ కూడ మెజార్టీ సాధించామని అందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన వెంట నిలచి పోరాడ, తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరూ ఆర్థికంగా రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేస్తానని చెప్పారు. బిసి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ జంగా కృష్ణ మూర్తిని తన సొంత గ్రామంలో కూడ సమావేశం పెట్టనీయకుండా ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. సమావేశంలో జెడ్‌పిటిసి జంగా వెంకట కోటయ్య,టిడిపి సీనియర్ నాయకులు వున్నం నాగమల్లిఖార్జునరావు, జనసేన నాయకులు రమేష్,బిజెపి నాయకులు టిడిపి పట్టణ,మండల అధ్యక్షులు గోంట్ల శ్రీనివాసరావు, గండికోట కోటేశ్వరావు పాల్గొన్నారు.

నా కుటుంబం ప్రజాసేవకే అంకితం: ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి-వినుకొండ

తన కుటుంబం ప్రజా సేవకు అంకితం అని, వారసత్వంగా తన తనయుడు హరీష్ కూడా శివశక్తి ఫౌండేషన్ ద్వారా పేదలకు సేవ చేస్తాడని ఎమ్మెల్యే జివి ఆంజనేయులు స్పష్టం చేశారు. జివి ఆంజనేయులు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం స్థానిక గంగినేని ఫంక్షన్ హాల్‌లో శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని, జిల్లా అంధత్వ నివారణ సంస్థ గుంటూరు, శివశక్తి లీల అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి శుక్లముల ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ తాను విద్యార్థి దశనుండే పేదలకు సేవ చేయాలని లక్ష్యంతో ముందుకు సాగానన్నారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తు న్నానని, పేదల కోసం అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని లక్ష్యంతో తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజక వర్గ ప్రజలకు రుణపడి ఉన్నానని అన్నారు. కార్య క్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజర్ సింహాద్రి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శుక్లాల వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు, వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

వైద్య శిబిరానికి విశేష స్పందన

వినుకొండలోని స్థానిక గంగినేని ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఉచిత కంటి శుక్లాల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర కంటి ఆసుపత్రి క్యాంప్ ఇంచార్జ్ మేనేజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరానికి 2,585 మంది పరీక్షలకు హాజరు కాగా, వారిలో 1863 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని వైద్యులు నిర్ధారించినట్లు శివశక్తి ఫౌండేషన్ మేనేజర్ జి.వి.రమణారావు, నిర్వాహకులు తెలిపారు. గత ఐదు రోజులుగా నియోజక వర్గంలోని బొల్లా పల్లి, నూజెండ్ల మండలాల్లో శివశక్తి ఫౌండేషన్ వైద్య శిబి రాలు నిర్వహించి కంటి పరీక్షలు చేసి నట్లు చెప్పారు.

ఘనంగా ఎమ్మెల్యే జీవీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు పుట్టినరోజు సందర్భంగా వినుకొండలోని నివాసంలో ఆయనను టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు పుట్టినరోజు వేడు కలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కడియాల వెంకటేశ్వర రావు పాల్గొని మాట్లాడారు. జీవి ఆంజనేయులు విను కొండ నియోజకవర్గానికి ఎమ్మెల్యే గా సేవలందించడమే గాకుండా, ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా శివ శక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్య క్రమాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టిపాటి జనార్ధన్ బాబు, షేక్ మన్నన్ షరీఫ్, కుమ్మెత కోటిరెడ్డి, షేక్ రఫీ, కోట నాగసుధీర్, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయులును సత్కరిస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేటలోని టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

భవన నిర్మాణ రంగ బలోపేతమే లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భవన నిర్మాణరంగాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా తీసుకుని ఉచిత ఇసుక నిర్ణయం హర్షణీయమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. నరసరావుపేటలోని గడియార స్తంభం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ 5 వేలు ఉండేదని ప్రస్తుతం రూ 15 వందలకే అందుబాటులో ఉందని తెలిపారు. వైసిపి హయాంలో ప్రజలు ఏమైపోయినా, కూలీలు కార్మికులు ఎలా పోయినా తమ జేబులు నిండడమే ముఖ్యంలా వ్యవహరించారన్నారు. భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన లక్షలాది కార్మికుల భవిష్యత్తే ప్రధానమని అన్నారు.

రేషన్ వాహనాలు, రైతు బజార్లలో మంత్రి ఆకస్మిక తనిఖీలు

రేషన్ వాహనం ఆపరేటర్ వద్ద అదనంగా ఉన్న రేషన్ కార్డులను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

- సరుకుల్లో వ్యత్యాసాలపై చర్యలకు ఆదేశించిన మనోహర్
- తోపుడు బండ్ల మీదకంటే రైతుబజారులో అధిక ధరలపై నిలదీత

ప్రజాశక్తి-తెనాలి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం పట్టణంలో ప్రజా పంపిణీకి ఉపయోగిస్తున్న ఎమ్‌డియు వాహనాలను, రైతు బజార్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్‌డియు వాహనాన్ని పరిశీలించిన మంత్రి అక్కడే ఉన్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఆపరేటర్ వద్ద ఉన్న రేషన్ కార్డులను పరిశీలించారు. వాహనం వద్ద ఉన్న లబ్ధిదారులు కాకుండా అదనంగా రేషన్ కార్డులు ఉండటాన్ని ప్రశ్నించారు. దీనిపై ఆపరేటర్ నుంచి సరైన సమాధానం రాకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరకులను, తూకాలను పరిశీలించారు. సరుకుల్లో వ్యత్యాసాన్ని గుర్తించారు. ఈ-పాస్ మిషన్‌లో సరకుల పంపిణీ వివరాలను ఇవ్వాల్సిందిగా ఆపరేటర్ను కోరడంతో ఆ సౌకర్యం లేదని ఆయన బదులిచ్చారు. దీంతో అక్కడే ఉన్న సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌తో మాట్లాడారు. సరుకులో వ్యత్యాసంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు బజార్‌ను పరిశీలించి కూరగాయల వ్యర్థాలను సైడ్ డ్రెయిన్లో వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తోపుడు బండ్లపై ఉన్న ధరల కంటే రైతు బజారులో టమోటా ధరలు అధికంగా ఉండటంపై ఎస్టేట్ ఆఫీసర్‌ను నిలదీశారు. బియ్యం, కందిపప్పు పంపిణీకి ఏర్పాటు చేసిన కౌంటర్ల నిర్వహణకు సమయపాలన పాటించకపోవడాన్ని గుర్తించి షాపుల నిర్వాహకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ప్రజలకు బియ్యం, కందిపప్పు చౌక ధరలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అయితే నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించటాన్ని తప్పుపట్టారు. షాపుల నిర్వహణలో కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. ఎమ్‌డియు వాహనం ఆపరేటర్ వద్ద రేషన్ కార్డులు ఉండడాన్ని గుర్తించామని, వాటిని స్వాధీనం చేసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించామని చెప్పారు. తోపుడు బండ్ల కంటే రైతు బజారులో కూరగాయల ధరలు అధికంగా ఉండటంతో సంబంధిత సూపర్వైజర్‌పై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, డిటి మూర్తి ఉన్నారు.

చెంచు సుబ్బారావుకు సత్కారం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

స్థానిక పిఎఎస్ కళాశాలలో 44 ఏళ్లపాటు సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన శాఖమూరి చెంచు సుబ్బారావుకు కళాశాలలో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. తొలుత సుబ్బారావు దంపతులను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు, విజిలెన్స్ రిటైర్డ్ ఎస్పీ కె.సత్యనారాయణ, మాజీ ఎంపిపి ఎన్.బాలకృష్ణ, కళాశాల పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది సత్కరించారు. కాలేజీకి సుబ్బారావు అందించిన సేవలను కొనియాడారు. సన్మాన గ్రహీత శాఖమూరి చెంచు సుబ్బారావు మాట్లాడుతూ కళాశాలతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రానున్న రోజుల్లోనూ కళాశాలలో జరిగే కెమిస్ట్రీ ల్యాబ్ ఎగ్జామ్స్‌కు సేవలు అందిస్తానని చెప్పారు. కళాశాల అభివృద్ధికి తనవంతు ఆర్థిక సాయంగా రూ.50 వేలను అందించారు. విశ్రాంత విద్యుత్ ఏఈ మిక్కిలినేని మోహనకృష్ణ మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న ఐదుగురు ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు.

సెల్ఫీ కొట్టు.. గిఫ్ట్ పట్టు..

- తెనాలి డబుల్ హార్స్ సెల్ఫీ కాంటెస్ట్

ప్రజాశక్తి-తెనాలి

వ్యాపార రంగంలో అగ్రగామి తెనాలి డబుల్ హార్స్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరలౌతోంది. దుబాయ్ ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొని తెలుగు వారి రుచులను ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన తెనాలి డబుల్ హార్స్, వ్యాపారాభివృద్ధిలో అందివచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోవటం లేదు. అనతి కాలంలోనే ప్రపంచ స్థాయిలో అన్ని వర్గాల ప్రజలు మెచ్చే ఆహార ఉత్పత్తులతో సత్తా చాటుతున్న సంస్థ ఇప్పుడు తెలంగాణాలో నిర్వహించే అతి పెద్ద బోనాలు పండుగను ప్రచారాస్త్రంగా మలుచుకుంది. తెలంగాణా వైభవానికి ప్రతీకైన బోనాల పండుగ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ తెనాలి డబుల్ హార్స్ ప్రచారాన్ని మేళవించి సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు వైరలౌతోన్న పాట...

'డోలు డోలు డోలు డోలు డోలు డోలు మోగుతోంది..
తెలంగాణా బోనమెత్తి సాగుతోంది..
నింగినేల సంబరాల రంగు దిద్ది పులుముతోంది
ఊరు వాడ గజ్జ కట్టి ఆడుతోంది
అమ్మ రావే..తల్లి రావే..అందు కోవె మా పూజని
అండ నీవే.. ఆదుకోవే.. నీకు తెచ్చా చీరె సారెలన్ని
పెద్ద పులి ఎక్కి...పెద్దమ్మ తల్లి వస్తోంది'...

అంటూ పాడుతా తీయగా ఫేమ్ ఉష రసరమ్యంగా

పాడిన పాట, లయబద్ధంగా చేసిన నృత్యం వీక్షకులను ఆకట్టుకుంటోంది. బోనాల పండుగను పురస్కరించుకుని తెనాలి డబుల్ హార్స్ నిర్వహిస్తున్న సెల్ఫీ కాంటెస్ట్‌లో లక్కీ విజేతలకు బహుమతులను కూడా ప్రకటించింది. ఇప్పుడు వీక్షకులు చేయాల్సిందల్లా బోనాలతో సెల్ఫీ దిగి 9133361619 నంబరుకు వాట్సాప్ చేయటమే. ప్రతి వారం లక్కీ విజేతలు 20 మందికి 10 గ్రాముల అమ్మవారి సిల్వర్ కాయిన్ అందిస్తామని, గరిష్టంగా 80 మందికి అవకాశం ఉందని, మరో 1000 మందికి ఆకర్షణీయమైన గిఫ్ట్ హ్యాంపర్స్ ఉన్నాయని సంస్థ అధినేత మునగాల మోహనశ్యామ్ ప్రసాద్ వెల్లడించారు.

ఆటుపోట్లను ఎదురొడ్డి సిపిఎం కోసం వర్మ కృషి

'ఎర్రజెండా నీడలో..నా అనుభవాలు' పుస్తకావిష్కరణలో వి.శ్రీనివాసరావు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వి.శ్రీనివాసరావు, కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, ఎక్కడ ఉన్నా సిపిఎం కోసం కృషి చేసిన ఎవి వర్మను ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఎవి వర్మ రాసిన 'ఎర్రజెండా నీడలో...నా అనుభవాలు' పుస్తకాన్ని వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. సిపిఎం పల్నాడు జిల్లా నాయకులు నూతలపాటి కాళిదాసు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్మ ఏ జిల్లాకు వెళ్లినా ఏ పనిలో ఉన్నా ఎర్రజెండాను వదల్లేదని అన్నారు. తన అనుభవాలను పుస్తకంగా రాయటం నేటి తరానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక సూక్ష్మమైన అంశాలు సామాన్య కార్యకర్తల రచనల ద్వారా వెలుగులోకి వచ్చాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ సమాజం సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, ఈ వ్యవస్థపై యువత విశ్వాసం కోల్పోయిందని అన్నారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, కెన్యా తదితర దేశాల్లో జరుగుతున్న ఆందోళనలు, మార్పులే ఇందుకు నిదర్శనమన్నారు. భారతదేశంలోనూ ప్రజల్ని ఎల్లకాలం శాశిస్తాం అని విర్రవీగిని బిజెపిని ఎన్నికల్లో ప్రజలు చావుదెబ్బ తీశారన్నారు. ఈ నేపథ్యంలో వర్మ వంటి కార్యకర్తల అనుభవాలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని, మరింత ఉత్సాహంగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ వర్మ జీవితం కమ్యూనిజంతో ముడిపడి ఉందన్నారు. పోస్టల్ ఉద్యోగిగా ఉద్యోగ సంఘంలోనూ, వివిధ ప్రజా సంఘాలలో, కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేశారన్నారు. రిటైర్ అయిన తర్వాతా విజయవాడ, తిరుపతి, గుంటూరులో పని చేశారన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ తిరుపతి సిపిఎంలో వర్మ ముఖ్య పాత్ర పోషించారన్నారు. వారి కుటుంబం మొత్తం పార్టీలోనే కొనతోందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ వర్మ ముక్కుసూటి మనస్తత్వం కలిగిన వారన్నారు. ప్రజాశక్తి దినపత్రిక పంపిణీ లోనూ పని చేశారన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి మాట్లాడుతూ వర్మ ఎప్పుడూ తోటి కార్యకర్తలకు సూటిగా మాట్లాడటం, ప్రశ్నించమని చెబుతారని అన్నారు. సిపిఎం తిరుపతి కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ చెప్పింది తూచ పాటించే వ్యక్తిత్వం కలవారని, కుల, మతాలకు అతీతంగా కుమార్తెలకు వివాహాలు చేశారని అన్నారు. సభలో ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్.బ్రహ్మానందరెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు ప్రసంగించారు. కార్యక్రమంలో పుస్తక రచయిత వర్మతోపాటు ఆయన కుమార్తెలు ఎ.కళ్యాణి, ఎ.వనజ, ఎ.పద్మజ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్

ఎస్ఎఫ్ఐ మంగళగిరి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - మంగళగిరి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మంగళగిరి నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.సాయి, పఠాన్ సమీర్, ఉపాధ్యక్షులుగా అహమ్మద్, ఇమ్రాన్, సహాయ కార్యదర్శులుగా శరత్, దేవా ఎన్నికయ్యారు. ఈ మేరకు పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ మంగళగిరి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వాలు హామీలిస్తున్నా ఇప్పటికీ నెలకొల్పలేదన్నారు. డిగ్రీ కాలేజీ కోసం ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. రాజధాని అభివృద్ధి అంటే ప్రైవేటు విద్యాసంస్థలను నెలకొల్పటం కాదని ప్రభుత్వ విద్యా సంస్థలను నెలకొల్పాలని అన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను, జూనియర్ కళాశాలను నిర్మించాలని, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. పీజీ అడ్మిషన్స్ జరుగుతున్న తరుణంలో జీవో 77ను వెంటనే రద్దు చేయాలని, దీనివల్ల ఉన్నత విద్య చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని ఆందోళన వెలిబుచ్చారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు ఎం.బాలాజి, గణేష్, సాయి పాల్గొన్నారు.

గంగానమ్మ ఆలయంలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లోని గంగానమ్మ ఆలయ పునఃప్రతిష్ట కార్యక్రమంలో ఆదివారం మంత్రి నారా లోకేష్ దంపతులు పాల్గొన్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం అన్నదానాన్ని లోకేష్ ప్రారంభించారు. టిడిపి సీనియర్ నాయకులు డి.సాంబిరెడ్డి, వైసిపి ఎమ్‌టిఎంసి అధ్యక్షులు డి.వేమారెడ్డి, ఎం.శ్రీధర్‌రెడ్డి, సిహెచ్.శ్రీరామ్, పి.నాగబాబు, పి.గాంధీ, నాగేశ్వరరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు వి.వెంకట్రావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త సిహెచ్.శ్రీనివాస్, ఎన్.అబద్దయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బోనాలు సమర్పించిన మంత్రి సవిత

ప్రజాశక్తి - దుగ్గిరాల

బిసి సంక్షేమ, చేనేత జౌళి పరిశ్రమల శాఖ మంత్రి ఎస్.సవిత మండలంలోని కంఠంరాజు కొండూరు శివారులోని శ్రీ మహంకాళి అమ్మవారికి ఆదివారం బోనాలు సమర్పించారు. ఆలయ సమీపంలో ఉన్న ఎస్ఎం గార్డెన్స్‌లో మహిళలు పొంగళ్లు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మంత్రిని సత్కరించారు. సర్పంచ్ చిలువూరు మాణిక్యం, టిడిపి నాయకులు వై.జయలక్ష్మి, పి.సాయిచైతన్య, పి.శ్రీనివాసరావు, టి.సీతారామయ్య, జి.శ్రీనివాస్, పి.కృష్ణప్రసాద్, బిట్టు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఓపీఎస్‌ను అమలు చేయాల్సిందే : యుటిఎఫ్

జీపీఎస్ అమలుపై గెజిట్ నోటిఫికేషన్ ప్రతులు దహనం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

జీపీఎస్ అమలు కోసం గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 54ను ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేశారు. పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి మాట్లాడుతూ సిపిఎస్ హామీపై గత ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేసిందని, ఓపీఎస్ అమలు హామీని విస్మరించి దాని స్థానే జీపీఎస్‌ను తెచ్చిందని, అందుకే ఆ ప్రభుత్వం ఓటమి పాలైందని చెప్పారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న సందర్భంలో గత ప్రభుత్వం ఇచ్చిన జీవో అమలుకు గజిట్ నోటిఫికేషన్ జారి చేయడం విస్మయానికి గురిచేసిందని అన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. నూతన ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు షేక్ కాసింపీరా, ఎం సాంబశివరావు, జమాల్, విశ్వరూపచారి, గోసు ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఫిరోజ్ బాషా, పి.నాగేశ్వరరావు, హనుమంతురావు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అంబులెన్స్ వితరణ

ప్రజాశక్తి-తాడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వానికి పర్వతనేని ఫౌండేషన్ తరపున ఆదివారం అంబులెన్స్‌ను అందజేశారు. ఉండవల్లిలో సిఎం చంద్రబాబునాయుడుకు కేంద్ర మాజీ మంత్రి పర్వతనేని ఉపేంద్ర 85వ జయంతి సందర్భంగా ఆయన కుమారుడు పర్వతనేని వివేక్‌ఆనంద్ అంబులెన్స్‌ను అందజేశారు. టిడిపి ఆవిర్భావ సమయంలో జనరల్ సెక్రటరీగా పనిచేసిన ఉపేంద్రతో తనకున్న అనుబంధాన్ని సిఎం గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపేంద్ర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముసురుతో హుషారు.. మరికొంత ఉసూరు

- కళకళలాడుతున్న వాణిజ్య పొలాలు
- వెదపద్ధతిలో సాగు చేసిన రైతుల్లో ఆందోళన
- దెబ్బతింటున్న ఆకుకూరల మడులు
- వానలింకా కొనసాగితే నష్టమే

దుగ్గిరాల పరిధిలోని పాలకూర తోట

దుగ్గిరాల పరిధిలోని చేమ పొలం

దుగ్గిరాల పరిధిలోని బెండ పొలం

కుంచనపల్లి పరిధిలోని ఆకుకూర మడులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

రెండ్రోజుల నుండి కురుస్తున్న వర్షాలు మిశ్రమ ఫలితాలను అందిస్తున్నాయి. వాణిజ్య పంటలు సాగుచేసే పొలాలు కళకళలాడుతుండగా ఇప్పటికే వెదపద్ధతిలో సాగైన వరి పొలాల్లో నీటి నిల్వలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆదివారమూ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మరో రెండ్రోజులు వర్షం పూర్తిగా లేకుంటే మాగాని పొలాల్లోని వర్షపు నీరు పూర్తి స్థాయిలో బయటకు వెళ్లే అవకాశం ఉంది. మరో ప్రక్క కోస్తా తీరంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలతో మాగాణి రైతులు బెంబేలెత్తుతున్నారు. మెట్ట పంటలైన అరటి, చేమ, బెండ, వంగ, దొండ, ఆకుకూరలు, సపోట, నిమ్మ తోటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. అయితే ఆ పొలాలకు కూడా ఇప్పటితో వచ్చిన నీరు చాలని రైతులంటున్నారు. వాణిజ్య పంటలు మండల వ్యాప్తంగా దాదాపు 5 వేల ఎకరాల వరకు ఉండవచ్చు. ఇదే ముసురు కొనసాగితే మండల వ్యాప్తంగా వెదపద్ధతిలో సాగైన 19 వేల ఎకరాల్లోని వరి పొలాల్లోని విత్తనాలు దెబ్బతినే అవకాశం ఉంది. సుమారు వెయ్యి ఎకరాల్లో ఇప్పటికే నారు మొలిచిన దృష్ట్యా దానికి పెద్దగా ఇబ్బంది ఉండదని రైతులంటున్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రెండ్రోజులుగా ఎడతెరిపి లేని వానలతో తాడేపల్లి ప్రాంతంలోని ఆకుకూరల రైతులు బెంబేలెత్తుతున్నారు. కుంచనపల్లి పరిధిలో సుమారు 300 మంది కౌలు రైతులు ఆకుకూరల సాగుపై ఆధారపడి జీవిస్తుంటారు. నిత్యం ఆకుకూరలను విజయవాడ, మంగళగిరి పరిసర ప్రాంతాల్లో రైతు బజార్, కాళేశ్వరరావు మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఆకుకూరల ద్వారా ఆదాయం బాగానే వచ్చినా అందుకు తగ్గట్టే పొలం కౌలు కూడా ఎకరానికి రూ.1.20 లక్షల నుండి రూ.లక్షన్నర వరకూ ఉంటుంది. వర్షాల వల్ల ఆకుకూర మడుల్లో నీరు నిలిస్తే అవి దెబ్బతిని, తీవ్ర నష్టం వాటిల్లుతుంది. వారం కిందట నాలుగు రోజులపాటు వాన పడి సాగుదార్లు కొంత నష్టపోయారు. ప్రస్తుతం మళ్లీ వర్షాలు, ఇవి మరో నాలుగు రోజులు కొనసాగుతాయనే ప్రకటనల నేపథ్యంలో కౌలురైతుల గుండెల్లో గుబులు పుడుతోంది.

చంద్రన్న బీమాలో నమోదు చేసుకోండి

- కనీస వేతనాల అమలుకు చర్యలు
- ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదు కొనసాగింపు
- ప్రజాశక్తితో కార్మికశాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న చంద్రన్న బీమా పథకంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు తమ పేర్లను గ్రామ వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని **కార్మికశాఖ జాయింట్ కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్** తెలిపారు. ఈ పథకంలో నమోదైన వారికి బీమా సదుపాయం వర్తింపజేస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు త్వరలో ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

చంద్రన్న బీమాను ఎవరు నమోదు చేసుకోవచ్చు?

వివిధ రంగాలకు చెందిన కార్మికులు, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారు ఎవరైనా తమ పేర్లను సచివాలయాలలో నమోదు చేసుకోవచ్చు. బీమా ఎవరికి వర్తింపజేయాలి? ఎంత పరిహారం ఇవ్వాలి? అనే అంశంపై త్వరలో ప్రభుత్వం ఆదేశాలు ఇస్తుంది. గతంలో కూడా చంద్రన్న బీమా ఉంది. కుటుంబ పెద్ద చనిపోతే గతంలో బీమా వచ్చేది. ఈ సారి కుటుంబంలో సంపాదించే ఏ వ్యక్తి చనిపోయినా బీమా వర్తింపచేసే ప్రతిపాదనపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నూతన మార్గదర్శకాలతో త్వరలో విధివిధానాలు ప్రకటిస్తారు. ఇందుకు నోడల్ ఏజెన్సీగా డిఆర్‌డిఎ వ్యవహరిస్తుంది.

ప్రభుత్వం జారీచేసిన కనీస వేతనాల వివరాలు?

కార్మిక శాఖ పరిధిలో ఉండే దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలను నిర్ధారిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రతి యాజమాన్యం అమలు చేయాలి. అమలు చేయని వారిపై ఎవరైనా కార్మికశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే విచారించి సంబంధిత తేడా సొమ్మును కార్మికునికి ఇప్పిస్తారు. ఇందుకు సంబంధించి యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి కనీస వేతనాలను నిర్ధారిస్తుంది. ఈ అంశంపై ఎప్పటికప్పుడు కార్మికశాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ఈ-శ్రమలో ఎంత మంది నమోదయ్యారు?

కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించేందుకు 'ఈ-శ్రమ' పోర్టల్‌ను ప్రారంభించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆరు లక్షల మంది వరకు నమోదు చేసుకున్నారు. రూ.15 వేలు ఆదాయంలోపు కలిగిన వారు ఎవరైనా నమోదు చేసుకోవచ్చు. ఇఎస్ఐ, పిఎఫ్ వర్తించని ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవచ్చు. ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారు ఎప్పుడైనా ప్రమాదంలో మృతి చెందితే రూ.2 లక్షలు సాయం అందుతుంది. కార్మికశాఖ కార్యాలయంతోపాటు కామన్ సర్వీసు సెంటర్ల, సచివాలయాలో కూడా నమోదు చేసుకోవచ్చు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు అమలు చేసే పథకాలు వీరికి కూడా వర్తిస్తాయి.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

డయేరియా బాధితులకు న్యాయం చేయండి : సిపిఎం

ఆస్పత్రిలో రోగులకు పరామర్శ - ప్రభావిత ప్రాంతాల్లో పరిశీలన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలో డయేరియాతో 10 రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డయేరియా నిర్మూలనకు ప్రభుత్వం సత్వరం చర్యలు తీసుకోవడంతోపాటు బాధితులకు న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు పట్టణంలోని లెనిన్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగులను, మృతుల కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. తాగునీటి సమస్యలు, పారిశుధ్యం, వైద్య సదుపాయాలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుండి పట్టణంలోని లెనిన్ నగర్, మారుతి నగర్, సంద్రపాలెం తదితర ప్రాంతాల్లో డయేరియా ప్రబలినా ప్రభుత్వం అరొకొర వైద్యంతో సరిపెడుతోందని విమర్శించారు. సున్నం బట్టీల్లో రెక్కల ముక్కలు చేసుకునే ముగ్గురు కార్మికులు మరణించినా ప్రభుత్వం పరిహారం చెల్లించకపోవడం శోచనీయయని అన్నారు. ఈ ప్రాంతాల్లో పవర్ బోర్లలో నీరు కలుషితం కావడం వల్ల వాటిని తాగిన వారు డయేరియా బారిన పడుతున్నారని, ఇన్ని రోజులైనా ప్రభుత్వం కనీసం మినరల్ వాటర్ సరఫరా చేయడంలో విఫలమైందని అన్నారు. ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని, ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించా లని, ప్రతి ఇంటికీ మినరల్ వాటర్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పనులు చేసే పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు అందించాలన్నారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు, బి.వెంక టేశ్వర్లు, షేక్ బాబు, ఎస్.వెంకటకృష్ణ పాల్గొన్నారు.